## క్లుప్తంగా

### చేనేతకు ప్రోత్సాహం కరువు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్

ముత్తుకూరు : చేనేత పరిశ్రమకు ప్రోత్సాహం కరువైందని, కులవృత్తిని విడిచి పెట్టి తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్ అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళెంలో ఆదివారం జరిగిన దేవాంగుల సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. కష్టపడి చదివే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకటసురేష్ మాట్లాడుతూ, జిల్లా దేవాంగ సంఘం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కోశాధికారి కొండా మాధవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, ఏరాసి సుబ్బారావు, పిచ్చుక మునిశేఖర్ పాల్గొన్నారు.

### రంగడి సన్నిధిలో గరుడోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచి కంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి, పెరియాళ్వార్లకు తిరుమంజనం, గరుడ, గజవాహనసేవలను నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### వ్యవసాయ పరిశోధనలు కనుమరుగు



పరిశోధన స్థానంలో నిర్మించిన నీటికుంట

పొదలకూరు : ఐదు దశాబ్దాల క్రితం పొదలకూరు ప్రాంత వరప్రసాదినిగా పేరు తెచ్చుకున్న చిరుధాన్య పరిశోధనా స్థానం ప్రస్తుతం పరిశోధనలు లేక వెలవెలబోతోంది. ఇక్కడ పరిశోధనలు జరగకపోవడానికి ప్రధాన కారణం నీటి లభ్యత లేకపోవడమే. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇక్కడి పరిశోధనా స్థానం పనిచేస్తుంది. పొదలకూరు పరిసర ప్రాంతాలైన రాపూరు, చేజర్ల, కలువాయి, సైదాపురం, మనుబోలు తదితర మండలాల్లో మెట్టపంటల సాగు అధికంగా ఉంటుంది. అపరాల సాగు ఉన్న ప్రాంతంలో మెట్ట వంగడాలపై పరిశోధనలతో పాటు, కొత్త వంగడాలను కనుగొనేందుకు ఇక్కడ పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్దేశించిన లక్ష్యాలు కొంతవరకు నెరవేరినా తర్వాత పరిశోధనా స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణకే పరిమితమైంది. ఇక్కడ కొత్త వంగడాలపై పరిశోధనలు జరిగి సుమారు మూడు దశాబ్దాలు దాటింది. 13 ఎకరాల్లో పరిశోధన స్థానం ఉండగా, ప్రస్తుతం సజ్జ, కంది పంటల సాగు చేపట్టారు. వర్షాధారంగా మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ తదితర పప్పు ధాన్యాలను రైతుల క్షేత్ర సందర్శన, విత్తనాల కోసం ప్రతి ఏడాది పండిస్తారు. పరిశోధనా స్థానం ఏర్పాటు చేసిన తొలినాళ్లలో పొదలకూరు జొన్న పేరుతో కొత్త వంగడాన్ని కనుగొన్నారు. అయితే జొన్నసాగు కాలానుగుణంగా దాదాపుగా అంతరించిపోయింది. నిధుల లేమి, నీటి సౌకర్యం లేకపోవడం పరిశోధనలకు అడ్డంకిగా మారడంతో శాస్త్రవేత్తలు వ్యవసాయం చేసి నాణ్యత కలిగిన పంట దిగుబడులపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

**పప్పుధాన్యాల సాగు**

పరిశోధనా స్థానంలో ఉన్న పొలంలో సీజన్ల వారీగా పంటల సాగు చేపడుతున్నారు. ఇందువల్ల రైతులకు క్షేత్రసందర్శన ద్వారా ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వినియోగించి అధిక ఫలసాయాన్ని దిగుబడి చేయడంలో మెళకువలు వివరిస్తున్నారు. దిగుబడి తగ్గినా నాణ్యమైన పంట దిగుబడి ఉండాలన్నది శాస్త్రవేత్తల ఉద్దేశం. అంతేకాక ఏజీ పాలిటెక్నిక్ కళాశాల పరిశోధనా స్థానంలో ఉండడం వల్ల విద్యార్థులు క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు పంటల సాగు ఉపయోగపడుతోంది. గతేడాది విద్యార్థులకు కొంత పొలాన్ని కేటాయించి వారి ద్వారా సాగు చేపట్టి ఫలసాయం తీసి నిధులు సమకూర్చుకున్నారు. మినుము టీవీజీ 104, పీయూ 31, పెసరలో వరంగల్ 42 రకాలను సాగు చేశారు. ఈ రకం విత్తనాలు ప్రధానంగా పల్లాకు తెగులును తట్టుకోవడంతో పాటు, ఏ సీజన్‌లోనైనా పంటదిగుబడి అందుతుంది. మెట్టరైతుల వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడే పరిశోధనా స్థానంలో నీటి లభ్యత సమస్యగా మారడంతో శాస్త్రవేత్తలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల పరిశోధనా స్థానం పొలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వ్యవసాయ నీటి కుంటను నిర్మించి సాగుకు నీటిని వినియోగిస్తున్నారు. ఈ కుంట వర్షం కురిస్తే నిండి పంటలకు నీటిని అందించేందుకు ఉపయోగపడుతుంది.

# ట్రాఫిక్ పద్మవ్యూహం

- ప్రధాన రహదారులపై రాకపోకలంటేనే హడల్
- అలంకారప్రాయంగా సిగ్నళ్లు
- నివేదిక దాటని కార్యాచరణ



ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో అలంకారప్రాయంగా సిగ్నళ్లు

నెల్లూరు(క్రైమ్): అంతంతమాత్రంగా రహదారులు.. నడిరోడ్లపైనే పార్కింగ్.. చొచ్చుకొచ్చిన ఆక్రమణలు.. అలంకారప్రాయంగా సిగ్నలింగ్ వ్యవస్థ.. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపేయడం.. విధుల్లో ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం.. వెరసి నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి ప్రజలకు నిత్యం నరకాన్ని చూపిస్తోంది. పాలకులు మారుతున్నా.. నగరం విస్తరిస్తున్నా.. సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించడం ద్వారా సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని భావించిన ట్రాఫిక్ అధికారులు నగరపాలక సంస్థకు నివేదిక అందించి ఏడాది కావొస్తోంది. అయినా నేటికి కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

**అన్నీ సమస్యలే..**

నెల్లూరు నగరం శరవేగంగా విస్తరిస్తోంది. నగర జనాభా ప్రస్తుతం తొమ్మిది లక్షలకుపైగా చేరింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినా రహదారులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడం, ఉన్నవి ఆక్రమణలతో కుచించుకుపోతుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి బోసుబొమ్మ, కనకమహల్, గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు వాహనాలు బారులుదీరి ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటోంది. ఫ్రీ జోన్లు, వన్‌వేలే మాయమయ్యాయి. దీంతో కార్యాలయాలు, విద్యాసంస్థలకు గంట ముందే నగరవాసులు బయల్దేరాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సిగ్నళ్లేవీ..?**

ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయడం ద్వారా సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు భావించారు. ఆత్మకూరు బస్టాండ్, కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నళ్లను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అయితే వీటిని వినియోగించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవి మరమ్మతులకు గురై అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. వీటిని ఇరు శాఖలూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో డైవర్షన్లను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే ఇవి దూరంగా ఉండటంతో అక్కడికెళ్లి వాహనాన్ని తిప్పుకొచ్చే ఓపిక లేక అనేక మంది రాంగ్‌రూట్‌లో వస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

**నివేదిక బుట్టదాఖలు**

నగరంలో సిగ్నళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించొచ్చని గతేడాదిలో నిర్వహించిన రోడ్డు భద్రత సమావేశంలో అప్పటి కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి.. ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయ సర్కిల్, అయ్యప్పగుడి, మినీబైపాస్‌లోని పూలే విగ్రహం, హరనాథపురం, రామలింగాపురం ప్రాంతాల్లో సిగ్నళ్లను ఏర్పాటు చేసేందుకు నివేదికను రూపొందించి నగరపాలక సంస్థ అధికారులకు అందజేశారు. రోడ్లను విస్తరించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఏడాది కావొస్తున్నా నివేదిక కార్యరూపం దాల్చలేదు.



కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఇలా..

**నిధుల్లేమే కారణమా..?**

ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలంటే ఒక్కో ప్రాంతానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ మేరకు బడ్జెట్ లేకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు ముందుకు రావడం లేదని సమాచారం. సిగ్నళ్ల వ్యవస్థ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య కొంత మేర పరిష్కారమయ్యే అవకాశం ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అధికారుల నిర్లక్ష్యంతోనే కుంగిన బ్రిడ్జి



పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో ఫ్లయ్‌ఓవర్ కుంగిన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం కారణమని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. ఫ్లయ్‌ఓవర్ కుంగిన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బ్రిడ్జిపై అనేక గుంతలు ఏర్పడ్డాయని, వీటికి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరినా, పట్టించుకోలేదని ఆరోపించారు. పనులను నాసిరకంగా చేపట్టడంతో ఈ దుస్థితి తలెత్తుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జాఫర్, నేతలు బయ్యన్న, బాబు, రసూల్, గడ్డం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీతపై ఇంటింటి ప్రచారం



నెల్లూరు(బృందావనం): నగరంలోని నవాబుపేట, కృష్ణానగర్, ఎఫ్‌సీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో నగర సంకీర్తన, గీతావైభవ సత్సంగాన్ని గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటా భగవద్గీత.. నెల్లూరంతా భగవద్గీత అనే నినాదంతో భగవద్గీత వైశిష్ట్యాన్ని వివరిస్తూ విస్తృత ప్రచారాన్ని గీతా వైభవ్ ట్రస్ట్ సభ్యులు నారాయణరేవతి, వరప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టామని చెప్పారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ అసిస్టెంట్ సెక్రటరీలు జయలక్ష్మి, శ్రీనివాసరావు, ఇందిర, కోశాధికారి రాజారామ్, కార్యనిర్వహణాధికారి జాలాది నాగేశ్వరరావు, సభ్యులు శశిధర్, ప్రభావతి, విజిత తదితరులు పాల్గొన్నారు.

# కాలువలకు మరమ్మతులు చేపట్టరూ..



మంత్రితో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో మంత్రిని ఎమ్మెల్యే ఆదివారం కలిశారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు వద్ద ధ్వంసమైన కరకట్టలు, రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో పలు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రభుత్వానికి సహకరిస్తాం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వానికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సహకారాన్ని అందించనుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ నిర్మాణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని కోరారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నారాయణరావు, నెల్లూరు జోన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, దాసరి బాబూశామ్యూల్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గ ఎన్నిక**

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్, జిల్లా కార్యదర్శిగా ప్రసాద్, 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



నెల్లూరు(అర్బన్): సచివాలయాల పరిధిలోని వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర స్థాయి అడ్మిన్ ఉద్యోగ సంఘ నేతలు సతీష్‌రెడ్డి, బాలు కోరారు. ట్రంక్‌రోడ్డు సమీపంలోని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. తమ సేవలను గుర్తించి అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల మేరకు ఇంక్రిమెంట్లు, ఇతర అలవెన్స్‌లను ఇవ్వాలని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, జనరల్ సెక్రటరీ సీతారామచైతన్య, నేతలు పాండు, పుట్టారావు, చిట్టిబాబు, ఆశదీప్, శేషుబాబు, రవి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై అర్జీలను అందజేయండి

నెల్లూరు(బారకాసు): వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను అందజేయాలని అదనపు కమిషనర్ శర్మద ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అర్జీలను సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు స్వీకరించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో 2004 – 05 బ్యాచ్‌కు చెందిన హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, విశ్రాంత విద్యాశాఖ జేడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కమిటీ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ తదితర మతాలకు సంబంధించి ప్రార్థనలు జరిపారు. తొలుత ఆశ్రమంలోని గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యుడు గంపల మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# డీవైఎఫ్ఐ నేతల శ్రమదానం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని భగత్ సింగ్ కాలనీలో శ్రమదానాన్ని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రూరల్ నియోజకవర్గ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలు చోట్ల పిచ్చి మొక్కలను తొలగించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఫిరోజ్, సుబ్రహ్మణ్యం, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, క్రాంతికుమార్, సమీన్, జీవన్, భానుప్రకాష్, కొండా ప్రసాద్, 25వ డివిజన్ శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### పాముల హల్‌చల్

**బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువులో పాములు ఆదివారం కలకలం సృష్టించాయి. ఒక్కసారిగా ఇవి కనిపించడంతో చెరువులో స్నానమాచరించే భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు చొరవ చూపి వీటిని తరిమారు. అధికారులు స్పందించి చెరువును పరిశుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.**

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



స్వర్ణాల చెరువులో పాము



తరుముతున్న చిన్నారులు

# ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా మరో 70 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డి మాట్లాడారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి రొట్టెల పండగను జయప్రదం చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొలుత దర్గాలో బారాషహీదులను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రొట్టెల పండగ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, సయ్యద్ సమీ హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(దర్గామిట్ట): తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని నగరంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు.

- ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

# మహనీయులకు ఇచ్చే గౌరవమిదేనా..?





పూలే దంపతుల విగ్రహాల చుట్టూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని వివిధ కూడళ్లలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవి కనపడకుండా చుట్టూ ఫ్లెక్సీలను కట్టేస్తున్నారు. బీసీలంటే తమకెంతో గౌరవమని అధికార పార్టీ నేతలు ఊదరగొడుతున్నా, వారి చేష్టలతో అది అవాస్తవమని అర్థమవుతోంది. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో గల జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల చుట్టూ అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో ఇతరులూ ఫ్లెక్సీలను పెట్టారు. ప్రముఖుల విగ్రహాలు కనిపించకుండా వాటి చుట్టూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై బీసీ వర్గాలు మండిపడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి అభయం



వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ పద్మజ



గర్భిణికి పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వైద్యాధికారులు

- ప్రతి నెలా వైద్యపరీక్షలు తప్పనిసరి

కోవూరు : మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని బుచ్చి సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ జి.పద్మజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డల ఆరోగ్యం గురించి ఆమె ఆదివారం మాట్లాడారు. గర్భం దాల్చిన మహిళ తొలి నుంచి ఒకే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ఆ గర్భిణికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే సీహెచ్‌సీలో మాతా శిశు సంరక్షణ కార్డులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయస్సు వరకు ఈ కార్డు వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తల్లికి బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేక ఐడీ నంబర్లు ఇస్తున్నారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన వైద్య పరీక్షల సమయాలను వాటిలో పొందుపరుస్తారని వివరించారు. దీని ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా బిడ్డను ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతారన్నారు. వీటితో పాటు ప్రధాన మంత్రి మాతృత్వ సంరక్షణ యోజన ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే వివరాలను కూడా అందులో పొందుపరుస్తారన్నారు. తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను కార్డులో ముద్రించి ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లలకు శారీరక మానసిక ఎదుగుల సంబంధించిన అంశాలను గుర్తించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలు నమ్మకం కలిగి ఉండాలన్నారు.